సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ׀ 29 ׀ ఏప్రిల్ ׀ 2024



జగన్ సభలో యువకుడి ఉత్సాహం



తాడిపత్రి వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం.(ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

తాడిపత్రిలో జనకెరటం

- సీఎం వైఎస్ జగన్ సభకు పోటెత్తిన జనం
- మండుటెండలోనూ ఆత్మీయ జల్లు
- ఉప్పొంగిన అభిమాన తరంగం
- తరలివచ్చిన మహిళాలోకం
- మార్మోగిన జగన్నినాదం

తాడిపత్రి/తాడిపత్రి అర్బన్: పైన భానుడి భగభగ.. కింద రోడ్డు సెగ.. సుమారు 44 డిగ్రీల ఉష్ణోగ్రత.. అయినా లెక్క చేయలేదు. అభిమాన నేతను చూసిన ఆనందంలో మండే ఎండ సైతం చిన్నబోయింది. అభిమాన తరంగం ముందు ఆత్మీయ జల్లులా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆదివారం తాడిపత్రి జనసంద్రమైంది. రహదారులు కిటకిటలాడాయి. వీధులు జన ప్రవాహాన్ని తలపించాయి. ఉదయం ఏడు గంటలకే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జననేత రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూశారు. ఆయన రాగానే జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో అభిమాన నేతను చూసేందుకు చాలామంది మిద్దెలు, మేడలెక్కారు. స్థానిక వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేసి.. సభా ప్రాంగణానికి తరలివచ్చారు.

అడుగడుగునా నీరాజనం..

గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి ఆదివారం ఉదయం 9.45 గంటలకు కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.15 గంటలకు తాడిపత్రిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి సభా స్థలి అయిన వైఎస్సార్ సర్కిల్‌కు రోడ్డుమార్గాన బయలుదేరిన సీఎంకు అడుగడుగునా నీరా'జనం' పలికారు. పుట్లూరు రోడ్డులో మహిళలు బారులు తీరి ఆత్మీయ సోదరుడికి హారతులు పట్టారు. కొందరు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అభిమాన నేతను చూసేందుకు మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. హెలిప్యాడ్ నుంచి 1.5 కి.మీ. దూరంలోని సభా స్థలికి చేరుకునేందుకు 45 నిమిషాలు పట్టింది.

మేమంతా సిద్ధం..

సీఎం వైఎస్ జగన్ స్థానిక వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకోగానే జగన్నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగి పోయింది. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు నాయకులు, అభిమానులు ఉత్సాహంగా కనిపించారు. ప్రసంగం మధ్యలో సీఎం పిలుపు మేరకు ఆయనతో గొంతు కలిపి సంఘీభావం ప్రకటించారు. దాదాపు 45 నిమిషాలు సాగిన సీఎం ప్రసంగాన్ని ఓపిగ్గా విన్నారు. చంద్రబాబు కుయుక్తులు చిత్తు చేసేందుకు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'మేము సైతం సిద్ధం' అంటూ నినదించారు.

తాడిపత్రిలో వ్యవసాయ కళాశాల

తాము తిరిగి అధికారంలోకి రాగానే తాడిపత్రి నియోజకవర్గంలో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేస్తామని సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. తాడిపత్రి నియోజకవర్గానికి ఆయన వరాల జల్లు కురిపించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.60 కోట్లు కేటాయిస్తామన్నారు. యాడికి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరగా.. సానుకూలంగా స్పందించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే పెద్దారెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. వాటన్నింటినీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని భరోసా ఇవ్వడంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.



ఆదరించండి: ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని ప్రజలకు పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అనంత తదితరులు



అభిమానం తోడుగా: సీఎం ప్రయాణిస్తున్న బస్సును అనుసరిస్తున్న ప్రజలు



'ఫ్యాన్స్' జోరు: సీఎం ప్రసంగిస్తున్న సమయంలో యువత ఉత్సాహం



మీరే బలం: రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

జేసీ కుటుంబం ఆటలిక సాగవ్

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ కుటుంబం ఆటలిక సాగవని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సర్కిల్‌లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. గత 35 ఏళ్లుగా జేసీ సోదరులు అనేక అరాచకాలకు పాల్పడ్డారన్నారు. తమ స్వార్థం కోసం పచ్చని పల్లెల్లో వర్గకక్షలకు ఆజ్యం పోశారన్నారు. గతంలో వారు పోలీసుస్టేషన్‌కు 24 గంటల పాటు తాళాలు వేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. చందాల పేరుతో రౌడీ మామూళ్లు వసూలు చేశారని ధ్వజమెత్తారు. తాడిపత్రిని మట్కాకు కేరాఫ్‌గా మార్చారని దుయ్యబట్టారు. తాము వచ్చాక ఆ నీచ సంస్కృతికి చరమగీతం పాడామన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకనే నియోజకవర్గంలో శాంతి కుసుమాలు విరిశాయన్నారు. జేసీ సోదరులు ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడు పట్టణంలో ఎక్కడ చూసినా పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేసేవారని, ప్రస్తుతం ఎక్కడా పికెటింగ్‌లు లేవని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చాగల్లు, పెండేకల్లు, ముచ్చుకోట రిజర్వాయర్లను నీటితో నింపామన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పించామన్నారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలే గుర్తించాలన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే, నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు.

నీకు సిగ్గుందా దివాకర్?

తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌ను ఆశీర్వదించాలని జేసీ దివాకర్‌రెడ్డి కోరుతుండడం సిగ్గు చేటన్నారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నారో మీ చిన్నాన్నను అడిగితే తెలుస్తుందని జేసీ పవన్‌కు పరోక్షంగా చురకలంటించారు. శాంతిభద్రతలు కాపాడటమే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. జేసీ అస్మిత్‌రెడ్డికి ఓటు వేస్తే దోపిడీలు, దౌర్జన్యాలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు.

దగాకోరు చంద్రబాబును నమ్మొద్దు



2014లో మోసపూరిత హామీలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చని దగాకోరు చంద్రబాబు అని ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ మండిపడ్డారు. నేడు మళ్లీ అలివిగాని హామీలతో వస్తున్న బాబును నమ్మి మోసపోరాదని ప్రజలకు సూచించారు. జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. అందరి బాగు కోరే వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలని కోరారు. జేసీ సోదరుల అరాచకాలను అడ్డుకుని ప్రజలకు అండగా నిలబడిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి నాగరాజారెడ్డి





సీఎం సమక్షంలో పార్టీలో చేరుతున్న నాగరాజారెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి.. పార్టీలో చేరుతున్న శివబాల

పుట్టపర్తి: పూర్వపు నల్లమాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తాడిపత్రికి రాగా, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగరాజారెడ్డి 1994 నుంచి 1999 వరకు నల్లమాడ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. అలాగే టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి, టీడీపీ కురుబ సాధికారత కమిటీ రాష్ట్ర కన్వీనర్, మంత్రాలయ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కురుబ బుల్లే శివబాల సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రత

- ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్



బిట్స్ కళాశాల వద్ద ఏర్పాట్ల గురించి అన్బుకుమార్ వివరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి అర్బన్/ హిందూపురం టౌన్/ లేపాక్షి: ఓట్ల లెక్కింపు కేంద్రాల (కౌంటింగ్ కేంద్రాలు) వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు అన్బు కుమార్ సూచించారు. ఆదివారం ఆయన జేసీ, హిందూపురం రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్, పెనుకొండ రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్, ఆర్డీఓ, పుట్టపర్తి రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖతో కలిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. లేపాక్షి మండలం నాయనిపల్లి క్రాస్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అలాగే హిందూపురం సమీపంలోని 'బిట్స్' కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోలింగ్ అనంతరం ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో నియోజకవర్గాల వారీగా సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు.

నేడే అభ్యర్థుల తుదిజాబితా

పుట్టపర్తి అర్బన్: నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ గడువు సోమవారంతో ముగియనుంది. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను రిటర్నింగ్ అధికారులు సాయంత్రం ప్రకటించనున్నారు. ఆ వెంటనే అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. పార్టీల అభ్యర్థులకు రిజర్వుడు గుర్తులే ఉంటాయి. వారు ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన తర్వాత వారు ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు.

113 మంది నామినేషన్లకు ఆమోదం..

జిల్లాలోని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానంతో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాలకు 113 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. పార్లమెంట్ స్థానానికి 15 మంది నామినేషన్లు ఆమోదం పొందగా, ఇందులో 8 మంది స్వతంత్ర అభ్యర్థులున్నారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు 98 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇందులో 50 మందికిపైగా స్వతంత్రులు ఉన్నారు. వీరిలో ఎందరు తమ నామినేషన్లు ఉపసంహరించుకుంటారనేది సోమవారంతో తేలుతుంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ఆర్‌ఓ ప్రకటిస్తారు.

క్లుప్తంగా

కట్టుదిట్టంగా 'ఏపీ సెట్'



ఎస్కేయూలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీ సెట్) – 2024ను ఆదివారం కట్టుదిట్టంగా నిర్వహించారు. మొత్తం 3,048 మంది అభ్యర్థులకు గాను 2,542 మంది హాజరయ్యారు. కాగా, పలు కేంద్రాలను ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య, సెట్ రీజనల్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.వెంకటరమణ ఉన్నారు.

అంబరం.. గుడికట్ల సంబరం



కురుబల ఇలవేల్పు స్వాముల ఊరేగింపు

కొత్తచెరువు: 'మన గుడికట్లు– మన సంప్రదాయాలు' పేరిట కురుబలు ఆదివారం తలమర్లలో నిర్వహించిన సంబరాలు అంబరమంటాయి. మూడు దశాబ్దాల తర్వాత నిర్వహించిన సంబరాలకు కురుబల ఇంటి వేల్పులైన తలమర్లప్ప, కనగానపల్లి పెదయ్య, గుడ్లూరప్ప, ద్యామాజ పల్లయ్య, ఇటుకల పల్లయ్య, మునీరప్ప, లోచర్లప్ప, బీరప్ప, గొల్లపల్లయ్య స్వాములను వాహనాల్లో ప్రత్యేకాలంకరణతో కొత్తచెరువు మండలంలోని పలు గ్రామాల్లో తిప్పుతూ తలమర్ల చేర్చారు. ఉరుములు, వాయిద్యాలు, గొరవయ్యల ప్రదర్శనలతో స్వాముల ఊరేగింపు వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన కురుబలు సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు పాటిస్తూ ఐక్యత చాటారు. గుడికట్ల సంబరాలకు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుంట శ్రీధర్‌రెడ్డి హాజరై స్వాములను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అశ్వవాహనంపై చౌడమ్మ



అమడగూరు: మండల కేంద్రం అమడగూరులో చౌడేశ్వరీదేవి ఉత్సవాల్లో ఆదివారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రెడ్డివారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, అశ్వర్థమ్మ దంపతులు, శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది. చౌడమ్మను పూల పల్లకీలో పురవీధుల గుండా ఊరేగించారు. ఉట్టి వద్ద భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ధగధగ మెరిసే నగలు, పట్టు వస్త్రాలతో అభయమిస్తున్నట్లు కనిపిస్తున్న చౌడేశ్వరీదేవిని దర్శించుకొని భక్తులు పునీతులయ్యారు.

కదిరిలో హ్యాట్రిక్ కొడదాం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్



ఆత్మీయ సమావేశానికి హాజరైన కదిరి నియోజకవర్గవాసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు

- వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంత పిలుపు
- బెంగళూరులో ఘనంగా కదిరి ఆత్మీయ సమావేశం
- భారీగా హాజరైన కదిరి ప్రాంత వాసులు
- తరలివచ్చిన ప్రముఖ నేతలు



బెంగళూరు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులతో మక్బూల్ అహ్మద్, అత్తార్ చాంద్‌బాషా, పూల శ్రీనివాసులురెడ్డి, లింగాల లోకేశ్వరరెడ్డి తదితరులు

బనశంకరి: కదిరి నియోజకవర్గంలో మూడోసారి కూడా వైఎస్సార్‌సీపీనే గెలవాలని ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ దొడ్డతోగూరులో కదిరి నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉద్యోగాలు, వివిధ పనుల కోసం బెంగళూరు ప్రాంతానికి కదిరి ఏరియా నుంచి వచ్చిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మక్బూల్ అహ్మద్ మాట్లాడారు. అభివృద్ధి – సంక్షేమం నినాదంతో ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఏపీలో చేపట్టిన 'నాడు–నేడు', అమ్మ ఒడి, రైతు భరోసా కేంద్రాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కదిరి నియోజకవర్గ వాసులు స్వస్థలాలకు వచ్చి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు.

అవకాశమిస్తే 'పురం' అభివృద్ధికి కృషి..

తనను గెలిపిస్తే హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. కేంద్రంతో మాట్లాడి లేపాక్షి హబ్ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఎంపీ అభ్యర్థిగా బోయ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశమిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. వెనుకబడిన తరగతుల వారు ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేస్తోందన్నారు. ప్రస్తుత ఎన్నికలు నిరుపేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీకి.. పెత్తందార్ల పక్షాన నిలిచిన టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి మధ్య జరుగుతున్నాయన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవడానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.

సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్..

అన్ని వర్గాల వారినీ ఆదుకునేందుకు పథకాలు అమలు చేసిన సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా కొనియాడారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లుగా భావించి జగన్ పాలన సాగించారన్నారు. గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. కదిరిలో మూడోసారి ముచ్చటగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సాధ్యమయ్యే హామీలే ఇస్తారు..

అమలుకు సాధ్యమయ్యే హామీలనే నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పొందుపరిచారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు వజ్ర భాస్కరరెడ్డి అన్నారు. చంద్రబాబు అబద్ధాలు చెప్పడంలో దిట్టని, మహిళలకు కిలో బంగారం ఇస్తామని బూటకపు హామీలు ఇస్తాడని, కానీ ఎలాంటి హామీలు నెరవేర్చడని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీని తీవ్రస్థాయిలో విమర్శించిన చంద్రబాబు నేడు అదే మోదీతోనే పొత్తు పెట్టుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఓటు అనే ఆయుధంతో చంద్రబాబును కుప్పంలో ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కదిరి అభివృద్ధి కోసం కృషి చేసే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని విమర్శించే అర్హత కదిరి టీడీపీ నేత కందికుంట ప్రసాద్‌కు లేదన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి..

ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన పథకాలను మేనిఫెస్టోలో పెట్టి అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. చంద్రబాబు తన హయాంలో ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేస్తే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దుతారని తెలిపారు. సమావేశంలో నల్లచెరువు జెడ్పీటీసీ విశ్వనాథరెడ్డి, కె.భక్తవత్సలరెడ్డి, లీగల్‌సెల్ సభ్యుడు లింగాల లోకేశ్వరరెడ్డి, పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి, కుటాగుళ్ల ఎంపీటీసీ ప్రణీత్‌రెడ్డి, విజయ రాఘవరెడ్డి, పూల ప్రవీణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, ఐటీ వింగ్ సమన్వయకర్త కుమార్, ఐటీ వింగ్ సభ్యులు, కదిరి ప్రాంతవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రచారాలకు ఎండ దెబ్బ

- సుర్రుమంటున్న సూరీడు
- ఉదయం నుంచే భానుడి భగభగలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో పరిమితంగా ప్రచారం



పుట్టపర్తిలో ఎండను లెక్క చేయకుండా తలకు టోపీ పెట్టుకుని ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి టౌన్: ఈ వేసవి చాలా హాట్‌గా ఉంటోంది. ఎన్నికల ప్రచార హీట్‌కు బ్రేక్ వేస్తోంది. మే 13న సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. నామినేషన్ల ఘట్టం ముగిసి ఇప్పటికే అభ్యర్థులు, కుటుంబ సభ్యులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఇంటింటికీ తిరుగుతున్నారు. ఉత్సాహంగా సాగాల్సిన వీరి ప్రచారం ఎండలు చికాకు తెప్పిస్తున్నాయి. జిల్లాలో 43 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిమిని భరించలేక అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొనేందుకు కేడర్, నాయకులు, కార్యకర్తలు జంకుతున్నారు. ప్రచారానికి సమయమూ తక్కువ ఉండటంతో ఉదయం, సాయంత్రం కేడర్‌తో సమావేశాలు, రోడ్‌షోలకు అభ్యర్థులు పరిమితమవుతున్నారు. వచ్చే వారం రోజుల పాటు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రుమాళ్లు, టవళ్లు, టోపీల సాయంతో ప్రచారానికి కదులుతున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల లోపు పరిమితంగా ప్రచారం చేసేలా ప్రణాళికలు రచించుకుంటున్నారు. ఉదయం ఉపాధి హామీ పనులు, వ్యవసాయ పనులు చేసుకునే వారి వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో కార్యకర్తలతో సమావేశాలు, ముందస్తు ప్రణాళికలపై కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.

సోషియల్ మీడియా వేదికగానూ ప్రచారం..

ఓటర్లను నేరుగా కలవడం కష్టమవుతున్న నేపథ్యంలో అభ్యర్థులు తమ కేడర్‌తో మొబైల్ నంబర్లు సేకరిస్తున్నారు. ఆయా నంబర్లకు ఐవీఆర్ ఎస్ కాల్స్, ఎస్ఎమ్ఎస్‌లు పంపి ఓటు అభ్యర్థిస్తున్నారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్‌లో ప్రచారంపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు దృష్టి సారిస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- ప్రతిష్టాత్మకంగా పోలీసు శాఖ చర్యలు
- జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- భారీగా నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు కొడికొండ వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

హిందూపురం అర్బన్/ పుట్టపర్తిటౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఆరు నియోజక వర్గాల్లో కేంద్ర ప్రత్యేక బలగాలతో పాటు రాష్ట్ర బలగాలతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎంసీఎంసీ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు 356 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 299 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతో పాటు గతంలో పలు కేసుల్లో ఉన్నవారు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మందిని బైండోవర్ చేశారు. సమస్య ఉత్పన్నమవుతుందని భావించే గ్రామాల్లో ఇప్పటికే ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడమే కాకుండా నిరంతర తనిఖీలు సాగిస్తున్నారు. ఫ్యాక్షన్, కక్షలు, పార్టీల వారీగా విభేదించి గతంలో గొడవపడ్డ వారి వివరాలతో ఇప్పటికే వారిని ఆయా స్టేషన్‌లకు పిలిపించి ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే జరిగే పరిణామాలు తెలియజేసి పంపుతున్నారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే తక్షణం అక్కడికి చేరుకునేలా కిందిస్థాయి నుంచి డీఎస్పీ స్థాయి వరకు అధికారులు ఇప్పటికే శిక్షణ తీసుకున్నారు.

జిల్లాలో పర్యవేక్షణ బృందాల వివరాలు						
నియోజకవర్గం	ఎంసీసీ	ఎఫ్ఎస్‌టీ	ఎస్ఎస్‌టీ	వీఎస్‌టీ	వీవీటీ	ఎంసీఎంసీ
మడకశిర	6	9	9	3	1	6
హిందూపురం	4	9	9	3	1	4
పెనుకొండ	6	9	9	3	1	6
పుట్టపర్తి	7	9	9	3	1	7
ధర్మవరం	5	9	9	3	1	5
కదిరి	7	9	9	3	1	7

సెల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో..

జిల్లా వ్యాప్తంగా సెల్ సిగ్నల్ లేని 10 ప్రాంతాలను గుర్తించారు. అక్కడ వైర్‌లెస్ సెట్‌లను సిబ్బందికి అందించి సిగ్నలింగ్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా కొండ ప్రాంతాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఈ సమస్య ఉన్నట్లు గుర్తించారు.

చెక్‌పోస్టుల్లో నిరంతర తనిఖీలు..

జిల్లా వ్యాప్తంగా కొడికొండ చెక్‌పోస్టు, తూమకుంట చెక్‌పోస్టు, అగళి వద్ద ఓ అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాం ఏర్పాటు చేశారు. అవి కాకుండా 13 రాష్ట్ర తనిఖీ కేంద్రాలు అటు కదిరి, అమ్మడగూరు, పావగడ–పెనుకొండ రహదారిలో ఇలా పలు చోట్ల నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 179 మంది సెక్టార్ అధికారులు వివిధ బృందాల ద్వారా తనిఖీలు కొనసాగిస్తున్నారు. కోడ్ అమలైనప్పటి నుంచి శనివారం వరకు రూ.1,32,58,178 నగదు, రూ.22,74,998 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలతో ప్రభావితం చేసే 6,46,770 విలువ చేసే వస్తువులను సీజ్ చేశారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తాం..



ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం. జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మ గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. కేంద్ర, రాష్ట్ర బలగాలతో నిరంతర నిఘా ఉంచాం. ఇక అంతర్రాష్ట్ర, రాష్ట్ర సరిహద్దుల్లోని తనిఖీ కేంద్రాల సిబ్బంది నిరంతర తనిఖీలు సాగిస్తున్నారు. నగదు, మద్యం, గిఫ్ట్ ఆర్టికల్స్ తరలిరాకుండా కట్టుదిట్టం చేశాం. మే 13న ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు చర్యలు తీసుకున్నాం.

– మాధవరెడ్డి, ఎస్పీ

లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛన్

పుట్టపర్తి అర్బన్: మే నెలకు సంబంధించి సామాజిక భద్రత పింఛన్ మొత్తాన్ని ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం ఉపయోగించి డీబీటీ ద్వారా చెల్లించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు పింఛన్ మొత్తాన్ని ఒకటో తేదీ జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలు లేని వారికి, మంచానికి పరిమితమైన వారికి, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, సైనిక్ సంక్షేమ పెన్షన్లు పొందుతున్న యుద్ధ అనుభవజ్ఞుల వృద్ధ వితంతువులకు మానవతా దృక్పథంతో ఇంటి వద్దనే అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పింఛన్ పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు.

వైభవంగా 'పోతులరాజు పుష్పాలంకరణ' మహోత్సవం





మహాకాళి రూపంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి, ఉత్సవానికి హాజరైన అశేష జనవాహిని

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సాయంత్రం పోతులరాజు పుష్పాలంకారణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాకాళి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రాజవంశీకుల ఇంటి నుంచి పోతులరాజులు ప్రత్యేకంగా అలంకరించుకుని పురవీధుల గుండా నృత్యం ఆడుతూ మంగళవాయిద్యాలతో కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలబావి సమీపంలో పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవం అశేష భక్తజనం నడుమ నిర్వహించారు. మహిళలు దేవాలయ సమీపంలో ఉన్న పాలబావిలో గంగపూజ చేశారు. ఇలా చేయడం వల్ల పిల్లలు లేని వారికి సంతాన ప్రాప్తి, దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారికి వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం పాలబావిలో గంగ పూజతో పాటు రాత్రికి పోతులరాజు బండారు మహోత్సవం నిర్వహించనున్నట్లు రాజవంశీకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

చెన్నేకొత్తపల్లి: గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. మృతదేహం చెన్నేకొత్తపల్లి – పెనుకొండకు వెళ్లే మార్గంలోని 44వ నంబరు జాతీయరహదారి వద్ద హంద్రీ– నీవా కాలువలో బయటపడింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం హంద్రీ– నీవా కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి భయంతో హైవే పైకి పరుగులు తీసి.. తర్వాత చెన్నేకొత్తపల్లి పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ ద్వారా సమాచారం అందుకున్న రామగిరి సీఐ శివాంజినేయులు, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహం బోర్లపడి ఉండగా.. దానిపై బెడ్‌షీట్ చుట్టి చుట్టూ రాళ్లు ఉంచారు. నీటిలోంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు బట్టతల కలిగి, 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, తెల్ల ప్యాంటు, బనియన్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. ఎక్కడో హత్య చేసి కాలువలో పడేశారా.. లేక హత్య చేశారా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తామన్నారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హిందూపురం రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ పరిశీలించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అమరాపురం: మద్దనకుంటకు చెందిన మధు (24) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. శనివారం రాత్రి భోజనం అనంతరం మధు ఇంటి బయట నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా అతడు కనిపించలేదు. ఎక్కడికెళ్లాడో తెలీక వారు అన్ని చోట్లా వెతకడం ప్రారంభించారు. మధ్యాహ్న సమయానికి కర్ణాటక ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మధు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా రోడ్డు ప్రమాదంలో చనిపోయాడా.. లేక ఎవరైనా హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారా అన్నది కర్ణాటక పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జూ.ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు పరాభవం

- టీడీపీ అభ్యర్థి ప్రచారంలో తోసివేత



గొల్లపల్లిలో జూ.ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను నెట్టేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్: టీడీపీ ఎన్నికల ప్రచారంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు పరాభవం ఎదురైంది. పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఆదివారం దుద్దేబండ పంచాయతీ గొందిపల్లిలో పర్యటించారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. అనంతరం దుద్దేబండ మీదుగా గొల్లపల్లి వరకు ప్రచార కార్యక్రమం సాగింది. గొల్లపల్లిలో టీడీపీ అభ్యర్థి సవితమ్మ మాట్లాడుతున్నపుడు జూనియర్ ఎన్టీఆర్ ఫొటోతో కూడిన జెండాలతో అభిమానులు వచ్చారు. వారిని అక్కడే ఉన్న టీడీపీ నాయకులు తోసేశారు. బీసీ కాలనీలో ముందుభాగాన భారీ జెండాతో వెళ్తున్న జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను మరోమారు నాయకులు అడ్డుకుని వారించారు. తాము కూడా కార్యకర్తలమేనని చెబుతున్నా వినలేదు. ఒక దశలో ఇరువర్గాల వారూ బాహాబాహీకి దిగారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ప్రేక్షకపాత్ర వహించడం విమర్శలకు తావిచ్చింది. చేసేదిలేక జూ.ఎన్టీఆర్ అభిమానులు అక్కడి నుంచి అవమాన భారంతో వెనుదిరిగిపోయారు.

ఏపీజీబీ మేనేజర్ అరెస్ట్

- ఖాతాదారుల పేర్లతో రుణాలు, పథకాల కింద నిధులు
- సొంతానికి వాడుకున్న బ్యాంకు మేనేజర్ పెంచల్‌రెడ్డి
- రెండేళ్ల తర్వాత చెన్నై ఎయిర్‌పోర్టులో అరెస్టు

అమడగూరు: ఖాతాదారులకు తెలియకుండా వారి పేర్లతో రుణాలు, వివిధ పథకాల ద్వారా నిధులు దండుకున్న స్థానిక ఆంధ్రప్రగతి బ్యాంకు సీనియర్ మేనేజర్ పెంచల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ మగ్బూల్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. 2021లో అమడగూరు ఏపీజీబీ మేనేజర్‌గా ఉన్న పెంచల్‌రెడ్డి ఆ సమయంలో ఖాతాదారులకు తెలియకుండా వారి పేరుతో రుణాలు, వివిధ పథకాల ద్వారా రూ 44.10 లక్షలు సొంత అవసరాలకు వాడుకున్నాడు. దీనిపై 2022 సెప్టెంబర్‌లో ఖాతాదారులు అతనిపై అమడగూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి మేనేజర్ పెంచల్‌రెడ్డి తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో ఖాతాదారులు తమకు న్యాయం చేయాలని పలుమార్లు ధర్నాలకు దిగారు. దీంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టు అధికారులకు అలర్ట్ పంపారు. ఈ క్రమంలోనే ఆదివారం పెంచల్‌రెడ్డి కౌలాలంపూర్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చే క్రమంలో చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు. చెన్నై ఎయిర్‌పోర్ట్ అధికారులు అమడగూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు వెళ్లి మేనేజర్ పెంచల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కదిరి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం జడ్జి అనుమతితో పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. కాగా అమాయక ఖాతాదారుల పేరుతో రూ.లక్షలు కొల్లగొట్టిన మేనేజర్‌ను అరెస్ట్ చేయడం పట్ల బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్లుప్తంగా

టీడీపీకి ఓటుతో బుద్ధి చెబుదాం



ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడం ద్వారా టీడీపీకి బుద్ధి చెబుదామని ఆపార్టీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం బుక్కపట్నం, బుచ్చయ్యగారిపల్లి పంచాయతీల్లో నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రిటైర్డు పీఆర్ డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, మైనార్టీ మండల కన్వీనర్ కదీర్, ఎస్సీ కాలనీకి చెందిన నీలూరి ఈశ్వర్, పూలకుంట్ల నాగభూషణ , శీనా,డీలర్లు నాగభూషణ, శంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, భగవంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యురాలు, పుష్ప, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెనుకొండ: పట్టణ శివారు ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి పోలీసులు పెద్ద ఎత్తున వాహనాల తనిఖీ చేపట్టారు. కార్లు, లారీలు, ఇతర వాహనాలను ఆపిన పోలీసులు నిశితంగా పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టిసారించినట్లు సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



పరిగిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరిగి: సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేసి, అఖండ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



ఇస్లాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని ఇస్లాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌యాదవ్, మహదేవపల్లి, శీఫారంలో కౌన్సిలర్ రామాంజినేయులు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించి ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ, గురురాజ్, తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి, శేషాద్రి, రామాంజినేయులు, ముఖ్యనాయకులు జయశంకరరెడ్డి, వెంకటేష్, కొండలరాయుడు, బోయబాబు, యాసిన్, వెంకటేష్, సిక్బతుల్లా, ఫరీద్,కృష్ణారెడ్డి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరుతున్న వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



మంత్రి ఉషశ్రీ చరణ్ సమక్షంలో పార్టీలో చేరిన సుధాకర్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు

పరిగి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఎస్సీ మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ గోవింద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో నాయకుడు బద్రీనాథ్ ఆధ్వర్యంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరగా కండువా వేసి ఆహ్వానించారు. గోవింద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషమ్మ, శాంతమ్మను అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

పరిగి: మండలంలోని ఊటుకూరులో టీడీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆ పార్టీని వీడి మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి ఉషశ్రీచరణ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో అభ్యర్థి సవిత ఒంటెద్దు పోకడలను ప్రదర్శిస్తున్నారని, కేవలం ఆమె వర్గానికి మాత్రమే ప్రాధాన్యమిస్తూ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని, ఇది ఆమె స్వార్థ పూరిత రాజకీయాలకు పరాకాష్టగా నిలిచిందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రెండు రోజుల క్రితం పార్టీని వీడి టీడీపీలో చేరి తప్పు చేశానన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పుట్టపర్తి: బుక్కపట్నంలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డు డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ నుంచి పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికి పార్టీ సీనియర్ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన సయ్యద్, అగ్రహారం సోమశేఖర్, పెదరాసు కిష్ట, ఆనంద్, నరేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం, ఎమ్మెల్యే దుద్దుకుంట చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అవుటాల రామలింగారెడ్డి, వైస్ సర్పంచ్ గౌరమ్మ, బూత్‌లెవల్ మేనేజర్ పతంజలి, నాగభూషణ, నీలూరి ఈశ్వర్, శ్రీనివాసులు, డీలర్లు నాగభూషణ, శంకర్, రఘు, నాగేంద్ర, రామక్రిష్ణ,నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమవారిపల్లిలో టీడీపీకి షాక్

ఓడీచెరువు: డబురువారిపల్లి పంచాయితీ కుసుమవారిపల్లిలో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి పలువురు ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన రామచంద్ర, వీరయ్య, ఆదినారాయణ, నంద, చెన్నకేశవులు, ఈశ్వరయ్య వారు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

టీడీపీలో లుకలుకలు

- ద్వితీయశ్రేణి నాయకుల ఆధిపత్యపోరు
- తలపట్టుకుంటున్న కార్యకర్తలు



గోరంట్ల: తెలుగుదేశం పార్టీలో ద్వితీయశ్రేణి నాయకుల అంతర్గత కుమ్ములాట రోజురోజుకు పెరిగిపోతోంది. మండలంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ వర్గాల మధ్య గత కొంతకాలంగా వార్ నడుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్‌ను పార్థసారథికి కేటాయించింది. ఈ నేపథ్యంలో వర్గ పోరు బహిర్గతం కాకుండా చాపకింద నీరులా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో సోమవారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గోరంట్ల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల ప్రచార నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించడానికి సవిత భర్త వెంకటేశ్వరరావు పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ప్రచార నిర్వహణను పార్టీ ముఖ్యనాయకులకు అప్పగించకుండా పట్టణ పార్టీకి సంబంధం లేని నాయకులకు ఆయన అప్పగించినట్లు సమాచారం. దీంతో గోరంట్లకు చెందిన ముఖ్య నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నట్లు తెలిసింది. పార్టీ వ్యవహారాల్లో టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ వ్యవహార శైలి సరిగ్గాలేదని కొండాపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరంగారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓ దశలో పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్... మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరంగారెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుందట. పార్టీలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప వర్గానికి ప్రాధాన్యత కల్పించలేదని మరో ఎంపీటీసీ సభ్యుడు హంపయ్య.. ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వరరావుతో వాగ్వాదానికి దిగినట్లు చెబుతున్నారు. ఎన్నికల వేళ మండల టీడీపీలో అంతర్గత విభేదాలు ఎక్కువవడంతో ఆ పార్టీ కార్యకర్తలు తలపట్టుకుంటున్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

పెనుకొండ: రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖామంత్రి ఉషశ్రీచరణ్ సోదరి జ్యోత్స్న ఆదివారం రాత్రి పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మహదేవపల్లి, శీఫారం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే ప్రజలకు సంక్షేమ పథకాలు నిరవధికంగా అందుతాయని పేర్కొన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే చంద్రబాబును ప్రజలు నమ్మి మోసపోరాదని, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



శీఫారంలో ప్రచారం చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్ సోదరి జ్యోత్స్న

'పల్లె.. నీచ రాజకీయాలు మానుకో'

కొత్తచెరువు: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని గ్రామాల్లో ఘర్షణలకు తెరలేపుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌బాషా హితవుపలికారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల పర్యటనలో భాగంగా శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర బండ్లపల్లిలో పర్యటించారన్నారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన అయూబ్‌ఖాన్‌కు మద్యం తాపించి స్థానిక నాయకుల ద్వారా వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల ముందు కేకలు వేస్తూ బాణాసంచా కాల్పించారన్నారు. రాత్రి సమయంలో అయూబ్‌ఖాన్ మద్యం మత్తులో తనను దుర్భాషలాడాడన్నారు. స్థానికులు అతడిని ఉదయం మాట్లాడామని చెప్పి పంపారన్నారు. ఇంతటితో ఆగని అయూబ్‌ఖాన్ దుస్తులు చింపుకుని తాము దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పల్లె ప్రోద్బలంతో పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటికైనా పల్లె ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని, ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, షౌకత్‌అలీ, మనోహర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

పుట్టపర్తి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి కోరారు. ఆదివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని సమాధిరోడ్డు, ఎనుములపల్లి బస్టాండ్, గణేష్ సర్కిల్ వార్డులలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఆమెకు మహిళలు పసుపు కుంకుమ ఇచ్చి హారతులుపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ పుట్టపర్తిలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి, ప్రభుత్వ అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. సత్యసాయి జిల్లా మీదుగా జాతీయ రహదారులు, ప్రతి చెరువుకు కృష్ణా జలాలు అందించిన ఘనత జగనన్నకు, శ్రీధరన్నకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామని కోరారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



గోపురం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న అపర్ణారెడ్డి

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన మరో వాహనం

పరిగి: మండలంలోని నేషనల్ హైవే 544ఈఈ రహదారిపై ఆదివారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలతో పాటూ మరో ద్విచక్ర వాహనం బాగా దెబ్బతిన్నాయి. స్థానికుల వివరాలమేరకు... కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిరాకు వెళ్లే జాతీయ రహదారిపై నేతులపల్లి సమీపంలో కోడిగుడ్లతో వెళ్తున్న ఓ బొలెరో వాహనానికి పంక్చర్ అయింది. ఈక్రమంలో పంక్చర్ వేయడానికి డ్రైవర్‌తో పాటూ మరో వ్యక్తి సాయంతో టైరు బయటకు తీశారు. ఈక్రమంలో మరో బొలెరో వాహనం వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ముందున్న ఓ ద్విచక్ర వాహనంతో పాటు ఆగివున్న బొలెరో వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో మూడు వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిసింది. కాగా జరిగిన ప్రమాద ఘటనపై పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని ఏఎస్ఐ జయలత తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

సంక్షేమాంధ్రప్రదేశ్ కావాలంటే జగనన్నే రావాలి

ఓడీచెరువు: సంక్షేమాంధ్రప్రదేశ్ కావాలంటే మళ్లీ జగనన్నే రావాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన సున్నంపల్లి పంచాయతీలోని నందివారిపల్లి, వంచిరెడ్డిపల్లి, ఎస్సీ,బీసీ కాలనీ, ఎంబీ క్రాస్, చౌడేపల్లి, రామయ్యపేటలో ఇంటిటా ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, జడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, యూత్ కన్వీనర్ హరినాథరెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్ణారెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, ఎంపిటీసీ గంగులప్ప,నాయకులు మనోహర్ రెడ్డి, లాయర్ క్రిష్ణారెడ్డి, నరసింహులు, మాజీ సర్పంచు సూరి, వీరాంజి, పురుషోత్తం, శేఖర్, రఘు, చిన్నపరెడ్డి, భాస్కర రెడ్డి, మామిళ్ల కుంట్లపల్లి రామస్వామి రెడ్డి, నరసింహరెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వంచిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న కిషన్ రెడ్డి

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె: కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో జరిగింది. సత్యసాయి జిల్లా కదిరి మండలం సామలగుంది గ్రామానికి చెందిన నారాయణప్ప (48), మదనపల్లె మండలం బెంగళూరులోని వేంపల్లి క్రాస్ వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం అంగడి సరుకుల కోసం మదనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా, మార్గమధ్యంలో.. విజయ డెయిరీ వద్ద బెంగళూరు నుంచి మదనపల్లి వైపు వస్తున్న మారుతి సుజుకి స్విఫ్ట్ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో నారాయణప్ప ఎగిరి అవతలపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బాధితున్ని తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



గాయపడిన నారాయణప్ప

ప్రశాంతి నిలయంలో గోవా సాంస్కృతిక శోభ



శిగ్మోత్సవ్ కార్యక్రమంలో గోవా భక్తుల ప్రదర్శన

ప్రశాంతి నిలయం: గోవా సత్యసాయి భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రశాంతి నిలయం నూతన శోభ సంతరించుకుంది. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత గోవా కళాకారుల బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏటా గోవా ప్రజలు సంప్రదాయం ప్రకారం వసంత రుతువుకు ముందు ఫాల్గున మాసంలో అందరికీ మేలు జరగాలన్న లక్ష్యంతో శిగ్మోత్సవ్ పేరుతో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా వారు సత్యసాయి మహాసమాధి చెంత చేపట్టిన ప్రదర్శన భక్తులు మైమరపింపజేసింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతుడు అంజినరెడ్డి (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వపల్లి గ్రామానికి చెందిన రామాంజినరెడ్డి కుమారుడు అంజినరెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు... శనివారం సాయంత్రం గ్రామంలో ద్విచక్ర వాహనంలో వెళ్తూ అదుపు తప్పి కిందపడడంతో గాయాలైనట్లు వివరించారు. అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతీరెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భర్త అంజినరెడ్డి తదితరులు పరామర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు వెంకటరమణప్ప

పెనుకొండ రూరల్: అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పెనుకొండ మండలానికి చెందిన వడ్డి వెంకటరమణప్ప (58) చనిపోయాడు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలమేరకు... నాగలూరు గ్రామానికి చెందిన వడ్డి వెంకటరమణప్ప మద్యానికి బానియ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది నాలుగు రోజుల క్రితం తన ఇంటి ఆవరణంలో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఫ్యానుకు ఉన్న తాడును తొలగించి గ్రామస్తుల సహకారంతో హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి వెంకటరమణప్ప మృతి చెందాడు. అల్లుడు కమల్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నట్లు చెప్పారు.

నేడు మంత్రి పర్యటన

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం, హనుమంపల్లి, కొండంపల్లి, చెర్లోపల్లి, మరువపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మంత్రి ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకుందాం



నాయకులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పుట్టపర్తి అర్బన్: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నేత రాఘవరెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం గువ్వలగుట్టపల్లి, బత్తలపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పుట్టపర్తి నియోజక వర్గం ఎంతో అభివృద్ధి సాధించిందని, ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కృషే కారణమన్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ మల్లిఖార్జున, నాయకులు గంగాద్రి, కాన్యాకుమారి, మోహన్ నాయక్, తిరుపాల్ నాయక్, సోమశేఖర్‌రెడ్డి, చంద్రాయుడు, ఆనంద్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథస్వామి పూల తేరు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పూల తేరు వైభవంగా జరిగింది. పార్థసారథి అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి విగ్రహాన్ని పూల పల్లకీలో ఊరేగించారు.



పార్థసారథి అలంకరణలో రంగనాథస్వామి